# క్రైస్తవునికి పాత నిబంధన యొక్క ఉపదేశం

హ్యూగో మెక్కార్డ్

కాబట్టి మనము విశ్వాసమూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తు నొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను (గలతీ. 3:24).

చెట్టునకు తల్లి వేరు (tap root) ఎంతటి ప్రాముఖ్యమో, క్రైస్తవ్యానికి పాత నిబంధన అంత ప్రాముఖ్యము. ప్రభువైన యేసును, క్రొత్త నిబంధన లేఖకులును పాత నిబంధనను ఉపయోగించారు. బాగుగా ఎరిగిన ప్రతి క్రైస్తవుడును నేడు పాత నిబంధనను ఉపయోగించ వలసిన ఆరు పద్ధతులను చూద్దాం.

## మూలమును పరిశీలించడం

"సృష్టి ఆరంభము" కొరకు (మార్కు 10:6) క్రొత్త నిబంధన పాత నిబంధనను చూపుతోంది. అలాగే, మానవ ఆదిని గూర్చిన ప్రశ్నలకు పాత నిబంధన జవాబిస్తుంది: "... సృజించిన వాడు ఆదినుండి వారిని పురుషునిగాను స్త్రీనిగాను సృజించెననియు ... మీరు చదువలేదా?" (మత్తయి 19:4). "–ఆదామను మొదటి మనుష్యుడు" అని క్రొత్త నిబంధన పాత నిబంధనను సూచిస్తుంది (1 కొరింథీ. 15:45). ప్రభువైన యేసును, పౌలును చేసినట్టు, మూలములనుగూర్చి అడుగబడినప్పుడు క్రైస్తవుడు ఆదికాండ గ్రంథాన్ని సూచింపవచ్చు.

## యేసు యొక్క దేవత్వాన్ని నిరూపించడం

పాత నిబంధన ప్రవచనాలు చదవడంవలన, యేసు దేవుని కుమారుడన్న విషయాన్ని నిశ్చయం చేసికోవచ్చు. నజరేయుడగు యేసు సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తు అనే ఆలోచనా విధానాలన్నీ కేంద్రీకృతమౌతాయి. వాటిలో అసాధారణమైన ఆయన ఉపదేశ విధానం (యోహాను 7:46), ఆయన పాప రాహిత్యము (యోహాను 8:46), ఆయన అద్భుతాలు (యోహాను 10:25), ఆయన ప్రభావము (అపొ. 4:13), మరియు త్యాగపూరితమైన ఆయన ప్రేమ (యోహాను 10:11) ఉన్నాయి. ఏదియెలాగున్నా, క్రొత్త నిబంధన క్రైస్తవులకు తరచుగా అంగీకారంగా ఉండేది పాత నిబంధనలో కన్పించే రుజువే.

పెంతెకొస్తు దినాన పేతురు ప్రసంగం, యేసు, "ప్రభువుగాను, క్రీస్తుగాను" నియమించ బడ్డాడన్న ఒక వాస్తవాన్ని సూచిస్తుంది (అపొ. 2:36బి). ఈ వాస్తవానికి పేతురు యోవేలు, కీర్తనల గ్రంథంలోని రుజువులనుండి ఎక్కువ భాగాన్ని తీశాడు. సొలొమోను మంటపము వద్ద అతని ప్రసంగంలో, "... దేవుడు తన క్రీస్తు శ్రమపడునని సమస్త ప్రవక్తలనోట ముందుగా ప్రచురపరచిన విషయములను ఈలాగు నెరవేర్చెను" అని పేతురు స్థిరపరచాడు (అపొ. 3:18-21). ఆత్మ తనకు వాక్ శక్తి అనుగ్రహించిన కొలది పేతురు ప్రసంగించి నందున (అపొ. 2:4), అతడు పాత నిబంధనను ఉపయోగించింది దేవుడు ఎలా కోరాడో అలాగే చేసియుంటాడు.

అలాగే, స్తెఫను ఆత్మవలన మాట్లాడుతూ (అపొ. 6:10), క్రీస్తు యొక్క దేవత్వాన్ని గూర్చి ప్రసంగించినప్పుడు, ఆదికాండం, నిర్గమకాండం, ద్వితీయోపదేశకాండం, యెహోషువ, ఆమోసు, మరియు యెషయా అనే వారిని అతడు సూచించాడు. ఐతియొపీయ నపుంసకునికి క్రీస్తును గూర్చి ఉపదేశించినప్పుడు, ఫిలిప్పు పాత నిబంధన లేఖనాన్ని వినియోగించాడు (అపొ. 8:26-38). అన్యజనుడైన కొర్నేలీకి ప్రభువైన యేసును గూర్చి యిలా వివరించాడు, "ఆయన యందు విశ్వాసముంచువాడెవడో వాడు ఆయన నామము మూలముగా పాపక్షమాపణ పొందునని ప్రవక్తలందరు ఆయననుగూర్చి సాక్ష్యమిచ్చు చున్నారనెను" (అపొ. 10:43).

పౌలు, అంతియొకయలో ప్రసంగించుతూ, కాండపంచకానికి, యెహోషువకు, సమూయేలు గ్రంథాలకు, కీర్తనల గ్రంథానికి, హబక్కూకు, యెషయాకు నేరుగా సూచించాడు. దీనికితోడు, యేసు సిలువ వేయబడినప్పుడు "ప్రవక్తల వచనములను" నెరవేర్చినట్టు అతడు సూచించాడు (అపొ. 13:27).

యేసు శ్రమపొంది మూడవ దినమున లేపబడుననే విషయాన్ని పాత నిబంధన లేఖనాలనుండి వివాదించడం పౌలు యొక్కయు, తక్కిన క్రొత్త నిబంధన సువార్తికులందరి యొక్కయు క్రమమైన ఆనవాలులుగానున్నట్టు గోచరిస్తుంది (అపొ. 17:3 చూడు). తగినట్టిదియు పాత నిబంధనను ఉపయోగించడంలో అతి ప్రాముఖ్యమైన యిది లూకా 24:27లో ప్రభువైన యేసుచేతనే వినియోగింపబడింది.

## గురుతులను అర్థం చేసికొనడం

ఆయనను గూర్చిన ప్రవచనాలతో పాటు, పాత నిబంధనలో ప్రభువైన యేసు మాదిరి, గురుతులు, లేక ఛాయలుగా ప్రదర్శింపబడ్డాడు. విడిపింపబడు మేక, పస్కా గొఱ్ఱెపిల్ల, ప్రధానయాజకుడు, దేవాలయపు తెర, మన్నా, లేక ఇత్తడి సర్పము అనేవాటిని క్రైస్తవుడు చదువునప్పుడు, క్రీస్తు చిత్రింపబడినట్టు అతడు చూస్తాడు. ఆదాము, మెల్కీసెదెకు, మోషే, దావీదు, యోనా, అనే వారియందు కూడా క్రీస్తు చిత్రించబడినట్టు అతడు చూస్తాడు. జలప్రళయం, నోవహు యొక్క కథ బాప్తిస్మానికి సాదృశ్యంగా ఉన్నట్టు అతడు గుర్తిస్తాడు (1 పేతురు 3:20, 21). హాగరు. శారాలను గూర్చిన కథను అతడు చదువు నప్పుడు, పాత, క్రొత్త నిబంధనల దృష్టాంతమును అతడు చూస్తాడు (గలతీ. 4:21-31).

హెబ్రీయులు ఎర్రసముద్రాన్ని దాటి వెళ్లడంలో, పాపియొక్క బాప్తిస్మాన్ని అతడు చూస్తాడు; అరణ్య ప్రయాణంలో సంఘం ఉదహరింపబడినట్టు అతడు చూస్తాడు; మరియు వాగ్దాన భూమియందు అతడు పరలోకపు రుచిని చూస్తాడు. ప్రత్యక్ష గుడారంలో, క్రొత్త నిబంధన సంఘం యొక్క రూపచిత్రాన్ని; యాజకత్వంలో, క్రైస్తవ్యం యొక్క ఛాయను అతడు చూస్తాడు. పాత నిబంధన సున్నతిలో, ఒకని జీవితంలోనుండి పాపము తుంచి వేయబడే సువార్త మాదిరిని అతడు చూస్తాడు.

## నిబంధనలను పోల్చడం

ఈలాటి సూత్రాలు పాత, క్రొత్త నిబంధనలలో బోధింపబడ్డాయి. మనుష్యుడు రొట్టెవలన మాత్రమేగాక దేవుని నోటనుండి వచ్చు మాటవలనను జీవించునన్న సూత్రం మోషేవలన ఎంత స్పష్టంగా బోధింపబడిందో, క్రీస్తువలన కూడా అంతే స్పష్టంగా బోధింపబడింది (ద్వితీయో. 8:3; మత్తయి 4:4). మనుష్యుడు దేవుని శోధింపకూడదు అనేది (మత్తయి 4:7) మొదట పాత నిబంధనలో వ్రాయబడినప్పటికంటె యిప్పుడు తక్కువ సత్యం కానేరదు (ద్వితీయో. 6:16). మనుష్యుడు అద్వితీయ సత్యదేవుని ఆరాధించాలనేది ఎల్లవేళలా సత్యమైయింది మరియు ఎల్లప్పుడు అలాగే ఉంటుంది (ద్వితీయో. 6:13; మత్తయి 4:10). రెండు నిబంధనల క్రిందను ముఖ స్తుతి తప్పే (యెషయా 29:13; మార్కు 7:6). ప్రతి నిబంధన క్రిందను లోబడవలసిన ఆజ్ఞలు వ్రాయబడియున్నాయి (ప్రసంగి 12:13, 14; యోహాను 15:10). ప్రతి నిబంధన క్రిందను, దైవ సందేశము ఉపదేశంచే నేర్పించబడింది (యెషయా 54:13; యోహాను 6:45). పాత నిబంధన యొక్క రెండు గొప్ప ఆజ్ఞలు (ద్వితీయో. 6:5; లేవీ. 19:18) క్రొత్త నిబంధన క్రిందను గొప్ప ఆజ్ఞలుగా నిలిచాయి (మత్తయి 22:37-39).

క్రొత్త నిబంధన ప్రవర్తనకు సంబంధించిన కొన్ని కీలక ఉపదేశాలు పాత నిబంధన లేఖన భాగాలద్వారా ఆదరించబడ్డాయి. ఉదాహరణకు, ద్వితీయోపదేశకాండం 25:4ను కోట్ చేయడంవలన సువార్తికుల సహాయం కొరకు పౌలు విన్నపం చేశాడు ( 1 కొరింథీ. 9:9; 1 తిమోతి 5:18). నీతి ప్రవర్తన యొక్క ప్రాముఖ్యతను చూపడానికి అతడు పది ఆజ్ఞలనుండి కోట్ చేశాడు (రోమా 13:8-10). పురుషుల నాయకత్వానికి స్త్రీలు లోబడి ఉండాలి అనడానికి అతడు పాత నిబంధనకు అప్పీల్ చేశాడు (1 కొరింథీ. 14:34; ఆది. 3:16 చూడు). పక్షపాతం చూపడానికి, వ్యతిరేకంగా బోధించడానికి యాకోబు పది ఆజ్ఞల మీద ఆనుకొన్నాడు (యాకోబు 2:8-11).

## నిబంధనల తారతమ్యం చూపడం

రద్దు చేయబడిన పాత నిబంధన చట్టాల తారతమ్యం చూపడంలో దేవుని యొక్క సూత్రాలు శ్రేష్ఠంగా కన్పిస్తాయి. ప్రభువైన యేసు పాత నిబంధననుండి ఎత్తిచూపి, “అయితే నేను చెప్పునదేమనగా” అని తన శిష్యులకు తెలిపారు (మత్తయ 5:21, 22).

పాత నిబంధన సున్నతికిని, క్రీస్తునందున్న నూతన సృష్టియొక్క హృదయ సున్నతికిని మధ్యగల భేదాన్ని పౌలు నొక్కి పలికాడు (యెహోషువ 5:2; గలతీ. 6:15).

పాత నిబంధన యొక్క చనిపోవు జంతు బలులకు వ్యతిరేకంగా క్రొత్త నిబంధన యొక్క సజీవమైన మానవ బలి (లేవీయ. 1:3; రోమా 12:1), భౌతికమైన యెరూషలేమునకు భిన్నంగా ఆత్మ సంబంధమైన సీయోనును మనం చూస్తాం (1 రాజులు 9:3; గలతీ. 4:26). గత చట్టం రాతి పలకలమీద వ్రాయబడింది, అయితే తరువాతది హృదయాలమీద వ్రాయబడింది (2 కొరింథీ. 3:3)

•

## ఉదాహరణలనుండి నేర్చుకొనడం

దేవుని యెడల విశ్వాస్యతను కనుపరచడంలో పాత నిబంధన వ్యక్తులు ఘనమైన మాదిరులుగా నిలిచియున్నారు (హెబ్రీ. 12:1). అలాగే, అవిశ్వాసానికి వచ్చే ఫలితాలను కూడా వారు ప్రదర్శించారు. ఏలీయాను, సారెపతు విధవరాలిని, ఎలీషాను, నయమానును చూపడానికి ప్రభువైన యేసుకు కారణం ఉంది (లూకా 4:25-27). తన ప్రసంగాలలో ప్రభువు నోవహును (మత్తయి 24:37), యోనాను (మత్తయి 12:41), సొలొమోనును (మత్తయి 12:42), లోతును అతని భార్యను సూచించడంతో ఉదహరించాడు (లూకా 17:29, 32).

ఇశ్రాయేలీయుల మధ్య ఉన్న అవిధేయత ఉదాహరణలవలన క్రైస్తవులకు సహాయం చేయవచ్చునని పౌలు నమ్మాడు (1 కొరింథీ. 10:1-12). పాత నిబంధన యొక్క మూలాధారాలు ఎంత ఎక్కువగా ఉన్నాయంటే, వాటన్నిటిని ఉపయోగించలేమని హెబ్రీ పత్రిక యొక్క రచయిత భావించాడు: “ఇకను ఏమి చెప్పుదును? గిద్యోను, బారాకు, సమ్సోను, యెఫ్తా, దావీదు, సమూయేలను వారిని గూర్చియు, ప్రవక్తలనుగూర్చియు వివరించుటకు సమయము చాలదు” (హెబ్రీ. 11:32).

## ముగింపు

పాత నిబంధనను తప్పుగా వినియోగించే సందర్భాలున్నా, ఆత్మల రక్షణకొరకు లాభదాయకంగాను, సరిగాను దానిని ఉపయోగించుకొనవచ్చు. లోకము, మానవ జాతి ఎలా ఉనికిలోనికి వచ్చాయో అది చూపుతోంది. మరియు నజరేయుడగు యేసు దేవుని కుమారుడని అది ప్రదర్శిస్తుంది. పాత నిబంధనలో క్రైస్తవ్యం యొక్క ఛాయలను మనం చూడగలం, మనం జీవించవలసిన అనేక సూత్రాలు దానిచే చూపింపబడియుండగా, స్వాతంత్రమునిచ్చు సంపూర్ణ నియమము యొక్క సౌందర్యానికి అది భిన్నంగా ఉంటుంది. చివరిగా, దేవునికి లోబడి నేడు జీవించునట్లు స్పష్టమైన ఉదాహరణలతో అది జనులను ప్రోత్సహిస్తుంది.